# గోంగూర నైవేద్యం

"శ్యామాలా! ఆ తలుపు వేసి ఓమాటిలా రా..."

మజ్జిగ గ్లాసుతో లోపలికి వస్తున్న శ్యామల అత్తగారివైపు కాస్త ఆశ్చర్యంగా చూసి, ఆవిడ చెప్పినట్లే తలుపులు బిగించి వచ్చింది.

"ఆ మజ్జిగ గ్లాసు అలా టేబుల్ మీద ఉంచి, ఇలా కూర్చో" అంది మంచం మీద జాగా చేస్తూ.

"చెప్పండి" అంది శ్యామల, ఆవిడ చెప్పినట్లే చేసి.

"ఈ ఇంట్లో ఎవ్వరికీ నా మనసు సంగతి పట్టలేదు. కనీసం నువ్వయినా నా మాట వింటావేమోనని ఆశతో అడుగుతున్నాను"

"చెప్పండి" అంది. అత్తగారికి తనమీదున్న నమ్మకానికి లోలోపల సంతసిస్తూ.

"నేను చెప్పిన పని చేస్తానని నువ్వు మాటివ్వాలి"

"అలాగే"

"అలాగే అంటే కుదరదు. ఇలా నా చేతిలో చెయ్యివేసి చెప్పు"

మందహాసం చేస్తూ చేతిలో చెయ్యి వేసింది.

"మాట తప్పావా ఊరుకోను" హెచ్చరించింది.

శ్యామలకి ఆవిడ ధోరణి అనుమానం కలిగించింది. ఈవిడ ఏం అడగబోతోంది. కొంపదీసి తను చేయలేని పని కాదు గదా!

ఆవిడ శ్యామల మొహంలోని భావాలు చదివి "ఏమిటి ఆలోచనలో పడ్డావ్? ఎలా తప్పించుకోవాలని ముందే ప్లాను వేసుకుంటున్నావా?" అంది దొంగని పట్టుకున్న పోలీసులా.

"అబ్బే... అదేంకాదు" అంది తడబడతూ.

"ఇదుగో శ్యామలా! నా సంగతి నీకు బాగా తెలుసు. ఈ ఇంట్లోకి నువ్వు కోడలుగా రావడానికి కారణం ఎవరో గుర్తుందిగా?"

"గుర్తుంది"

"ఎవరూ?" రెట్టించింది.

"మీరే!" సిగ్గుగా తలవంచుకుంది.

"ఊ.. ఆ సంగతి గుర్తుంచుకుని మరీ ప్రవర్తించు.." అని ముందరకాళ్లకి బంధం వేసింది.

శ్యామలకి ఫ్లాష్‌లా గతం మనసులో మెరిసింది.

తనూ, సుందరం మనసారా ప్రేమించుకున్నారు. ప్రేమ పెళ్లిగా మారాలంటే రాగల కష్టాలన్నీ వచ్చాయి. సుందరం అందర్లోకి చిన్నవాడు కాబట్టి, అమ్మ గారాబం ఉంది. తనని ఇంటర్వ్యూ చేసి, చెప్పాల్సినవన్నీ చెప్పి భర్త మనస్తత్వం తెలుసుగనక 'రివర్స్ గేర్'లో విషయాన్ని నడిపించి, వ్యవహారం పరిష్కరించిన అత్తగారి మేధాశక్తికి "హేట్సాఫ్" అని అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ అనుకుంటుంది.

అరవయ్యేళ్ల జీవితంలో ఏనాడూ ఆవిడ మంచం పట్టింది లేదు.

కడుపులో అల్సర్లు ఉన్నాయని, కఠిన పథ్యంతో ఆవిడ నిప్పుడు మంచానికి అంకితం చేశారు. అంతవరకు ఆ ఇంటిని ఏకచ్ఛత్రాధిపత్యం క్రింద నడిపిన ఆవిడకి ఎలక్షన్లో ఓడిపోయిన ప్రధానమంత్రిలా ఒంటరిగా కాలక్షేపం చెయ్యలంటే వల్లకావటం లేదు. సానుభూతి పేర్న జరిగే మానసిక హింస, పలకరింపుల పేర్న గుచ్చే సన్నని ముళ్లు ఆవిడకి యిబ్బందికరంగా ఉన్నాయి.

"పాపం... మీకు కడుపులో అల్సరుటగా... ఊరగాయ రుచి చూసి ఉప్పు చాలిందో లేదో చెబుతారని వచ్చాను... మీ కోడల్నడుగుతాలెండి..." అని పొరుగింటి పార్వతి.

"ఇలా మంచాని కతుక్కుని పడుకోవటం కష్టమే... కాస్త అటుయిటు తిరగండి" అని ఉచిత సలహా యిచ్చే ఉమాదేవి, (మామగారు చండప్రచండుడని, రోగం వస్తే కఠిన నియమాలు కఠోర అంక్షలు పెట్టి వేధిస్తాడని వాళ్లకి తెలియదు)

అత్తగారి అవస్థలు చూస్తున్న శ్యామలకి జాలి వేస్తున్నా ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితి. మజ్జిగ అన్నం తప్ప మరేమీ పెట్టకూడదు. అవిడకసలే రుచుల పిచ్చి. ఆంధ్రమాత గోంగూర అంటే అవిడకి ఆరో ప్రాణం. అలాంటిది గోంగూర పచ్చడిని కంటితో కూడ చూడనియ్యడం లేదు మామగారు. ఇంట్లో ఉంటే దొంగచాటుగా ఎక్కడ తింటుందో నని, ఉన్న పచ్చడంతా పని మనుషులకి ఇచ్చేశారు.

ఆవిడకీ తంతుతో తను ఏ దండకారణ్యంలోనో అపక్వాహారం మీద బంజారీలా బతుకుతున్న ట్లనిపించసాగింది. ఇదంతా మననం చేసుకుంటూ పరధ్యానంలో పడిన శ్యామల.

అత్తగారు గట్టిగా కుదపటంతో ప్రస్తుతంలోకి వచ్చింది.

"ఏమిటే నీ ఆలోచన?" అంది దబాయింపుగా.

"అబ్బే...ఏం లేదు... మీ గురించే ఆలోచిస్తున్నాను...!"

అవిడ వెంటనే ప్రసన్నంగా "నాకు తెలుసు... నీకు నేనంటే చాలా ప్రేమ" అని ఒక ప్రశంస పడేసింది.

అది తనని దార్లోకి తెచ్చుకోవటానికేనని తెలుసు గనుక శ్యామల పొంగిపోలేదు.

"చెప్పండి...ఏం చెయ్యాలి నేను?"
"ఎల్లుండి తారీఖు ఎంత?"
"నవంబరు ఒకటి..."
"అంటే?"
"ఆంధ్రప్రదేశ్ అవతరణ దినం.."
"ఆ రోజున మనింట్లో మీమామగారు ఏం చేస్తారు?"
"పిల్లలందరి చేత పాటలు పాడించి, మిఠాయిలు పంచిపెడతారు.."
"ఇంకా?"
"తెలుగుతల్లి పటానికి పూలమాల వేసి పూజ చేస్తారు.." (ఎందుకీ ఇంటర్వ్యూ)
"ఇంకా!?"
"ఇంకా ఏముంది..." అంది గుర్తు చేసుకోవటానికి ప్రయత్నిస్తూ.
"నైవేద్యం పెట్టరూ?"
"అవునవును...పళ్లు, స్వీట్లు నైవేద్యం పెట్టి పిల్లలందరికీ పెడతారు...ఇందాక చెప్పాగా?"
"నీ మొహం చెప్పావ్...పిల్లలకి పంచి పెడతారన్నావ్... నైవేద్యం సంగతి చెప్పలేదుగా..."
"ఓ...అదా?!" నవ్వింది, "అయినా, యిప్పుడు ఆ సంగతి దేనికి?"
"పని ఉంది..." గుంభనంగా అంది.
ఆవిడ మనసులో ఏదో వింత ఊహ ఉన్నట్లు మొహమే చెబుతోంది.
"ఆంధ్రమాత అంటే తెలుసుగా?"
"ఎందుకు తెలియదూ... గోంగూర..."
"ఎల్లుండి నువ్వు చక్కగా గోంగూర పచ్చడి చేసి, తెలుగు తల్లికి నైవేద్యం పెట్టాలి..."
శ్యామల విస్తుబోతూ "గోంగూర పచ్చడి నైవేద్యమా?" అంది.
"అవును... తెలుగు తల్లికి గోంగూరే నైవేద్యం పెట్టాలి... ఈ మాత్రం ఇంగిత జ్ఞానం, బుద్ధీ ఎవరికీ లేవు... ఇంతకీ నువ్వు నేను చెప్పిన పని చేస్తున్నావా లేదా?"
శ్యామలకి విషయం అర్థమై పోయి, పడీ పడీ నవ్వింది.
"నోర్ముయ్... పెద్దగా నవ్వావంటే ఇప్పుడు మీ మామగారొచ్చేస్తారు... ఊం మింగు...నవ్వు మింగేసేయ్... లేకపోతే చంపేస్తా..."
ఆవిడ మాటలకి ఇంకా ఇంకా నవ్వొచ్చి... శబ్దం పైకి రాకుండా డొక్కలెగరేస్తూ నవ్వి నవ్వి నడుంనొప్పితో మంచం మీద సోలిపోయింది. శ్యామల.
"ఎందుకే నీకంత నవ్వొచ్చింది?" సీరియస్‌నెస్ నటిస్తూ అడిగింది.

"ఎవరన్నా, ఏడుపు మింగమంటారు... మీరేమిటి నవ్వు మింగమంటారు?" అంది మళ్లీ నవ్వుతూ.

"ఏదో ఒకటిలే... ఇంతకీ నువ్వు గోంగూర పచ్చడి నైవేద్యం పెడుతున్నావా లేదా?"

"పెడితే మీకేమిటీ లాభం?"

"ముందు నేను చెప్పిన పని చెయ్యి..."

"సరే...అలాగే... ముందీ మజ్జిగ తాగండి" అని గ్లాసు అందించింది.

000

"మా తెలుగుతల్లికి మల్లెపూదండ...

మము కన్నతల్లికి మంగళారతులూ..."

పిల్లలు గొంతెత్తి ముద్దుముద్దుగా పాడుతున్నారు.

శ్యామల తెలుగుతల్లి ఎదుట నైవేద్యం చక్కగా అమర్చింది. గోంగూర పచ్చడి మాత్రం మూత తియ్యకుండా గుంభవగా ఉంచింది. మధ్య మధ్య అత్తగారికేసి బెరుగ్గా చూస్తోంది. ఆవిడ కళ్లతోనే ఆదేశాలు ఇస్తోంది. ధైర్యం చెబుతోంది. ఆవిడ వళ్లో బ్రెడ్ పాకెట్ ఉంది. తాపీగా ఒక్కొక్క ముక్క తింటూ, గోంగూర గిన్నె కోసం చూస్తోంది. ఏ గిన్నెలో ఉందో...సస్పెన్సు!

గిన్నెమూత తీస్తే మామగారు చూస్తాడేమోనని శ్యామల భయం.

తీయకపోతే, అత్తగారు నమ్మదేమోనని అనుమానం.

అప్పటికీ, ఆవిడ కళ్లతోనే ఇంటర్వ్యూ మొదలెట్టింది.

"తెచ్చావుటే?"

"తెచ్చా..."

"ఎక్కడ తగలెట్టా?"

"అదుగో... ఆ గిన్నెలో..."

"ఆ గిన్నె అంటే ఏ గిన్నె? అక్కడ అయిదు గిన్నెలు తగలేసావ్..." విసుగు.

"నేను మూత తీస్తాగా... కాస్త ఓపిక పట్టండి..."

"ఏం ఓపికో... యీ రొట్టెముక్కలు తినలేక చస్తున్నా...నోరు చవి చచ్చిపోయింది..."

శ్యామలకి జాలి వేసింది.

"అమ్మాయ్ శ్యామలా! పాటలు అయిపోయాయి... యిక నైవేద్యం పెట్టు..." మామగారు హుకుం జారీ చేసాడు.

ఉలిక్కిపడి నైవేద్యం పెట్టటానికి ఉపక్రమించింది శ్యామల.

ఓ పక్క క్రీగంట మామగారిని పరికిస్తోంది.

ఆయన పిల్లలతో జోకులు వేస్తూ బిజీగా ఉన్నాడు.

ఇదే అదనని గోంగూరపచ్చడి మూతతీసి, చకచక నైవేద్యం పెట్టేసి మళ్లీ మూత వేసింది. ఆ కొద్ది క్షణాల వ్యవధిలో శ్యామల అత్తగారి కంట ఆంధ్రమాత పడింది! ఆవిడకి హుషారొచ్చేసింది. రొట్టెముక్కల మధ్య జామ్‌లా గోంగూర పచ్చడి రాసి, ఎంచక్కా ఎంజాయ్ చేస్తూ తినేందుకు జిహ్వ తహతహలాడింది.

శ్యామల పిల్లలకి స్వీట్లు పెడుతూనే ఉపాయంగా అత్తగారి రొట్టెల మధ్యకి కాస్త గోంగూర పచ్చడి తోసేసింది. ఆవిడ కూడా అతివేగంగా, అనుమానం రాకుండా రొట్టెను సర్దుకుని గదిలోకి వెళ్లిపోయింది.

"మామయ్యగారూ! ఇవిగో స్వీట్లు... మీ చేత్తో అందరికీ పెట్టండి" అని ట్రేలో ఉంచి అందించింది.

ఆయన ఉత్సాహంగా అందుకుని అందరికీ స్వీట్లు పంచటం మొదలెట్టాడు. ఈలోగా శ్యామల ఆంధ్రమాత గిన్నె వంటింట్లోకి చేర్చింది.

అప్పటికే అక్కడ సుందరం జేరి, గిన్నెలన్నీ వెతుకుతున్నాడు.

"ఏం కావాలి?" అంది శ్యామల.

"స్వీటు"

"అక్కడ మీ నాన్నగారి దగ్గరున్నాయి... వెళ్లి తీసుకోండి.."

"అమ్మో... ఆయన దగ్గరికి వెళ్లటమే..."

"ఏం..."

"వద్దులే.. నీ దగ్గరున్న స్వీటివ్వు..."

"నా దగ్గరెక్కడివి?"

"అదేం గిన్నె..."

"ఇది స్వీటు గిన్నె కాదు.."

"ఏదీ చూడనీ..."

"అబ్బ.. వద్దులెండి..."

"అబ్బ... చూడనీ..."

"వద్దన్నానా..."

"చూడాలన్నానా..."

పెనుగులాడుకున్నారు. ఆ సందడిలో సుందరం వేగంగా శ్యామలకో ముద్దు కూడ యిచ్చేశాడు.

చిరుకోపం నటిస్తూ "ఇక వెళ్లండి... మీ స్వీటు మీకు దొరికిందిగా.." అంది.

"దొరికింది లేవోయ్... ఇంతకీ ఈ గిన్నెలో ఏముందో చూడనీ.." లాక్కోబోయాడు.

జారిపడింది. మూత విడిపోయింది.

పచ్చడి నేలపాలు..

ఆశ్చర్యంగా చూస్తు "గోంగూర పచ్చడా.." అన్నాడు విస్తుబోతూ.

అప్పుడే అటుగా వచ్చిన మామగారు ఆమాట విని "గోంగూర పచ్చడి ఏమిటి?" అంటూ లోపలికి వచ్చాడు.

అంతే!

శ్యామల తొలి దొంగతనంతో దొరికిపోయిన దొంగలా మాటరాక, భయ భయంగా పచ్చడిని చప్పున గిన్నెలోకి ఎత్తేసి "ఏమీ లేదండీ" అంది.

పరిశీలనగా చూసి "ఏమి లేకపోవటమేంటి? అదేం గోంగూర పచ్చడి.." అన్నాడు ఆయన. శ్యామల గిల్టీగా తలదించుకుంది.

"ఇంట్లో గోంగూర పచ్చడి చేయవద్దంటే ఎందుకు చేశావ్?"

"అదీ... తెలుగు తల్లికి నైవేద్యం కోసం చేశాను.."

"ఏమిటీ... తెలుగు తల్లికి గోంగూర నైవేద్యమా?" ఆయన ఫెళ్ళున నవ్వేడు. అలా తెరలు తెరలుగా నవ్వి "ఎలా వచ్చింది నీకీ అయిడియా?" అనడిగాడు.

శ్యామల ఏదో చెప్పేలోగానే, "గోంగూర భక్తురాలు మీ అత్తగారి ఐడియా కాదు గదా?" అన్నాడు అనుమానంగా చూస్తూ.

"అబ్బే కాదండీ.." అంది చప్పున.

"అయితే కొద్దిగా ప్లేటులో వేసివ్వు, మీ అత్తగారు తక్కువ మోతాదులో కారం తినొచ్చని డాక్టరు చెప్పాడు. బ్రెడ్ ముక్కల మధ్య జామ్‌లా పల్చగా రాసిస్తాను.. తింటుంది" అంటు ప్లేటులో పెట్టించుకు వెళ్లాడు.

శ్యామలకి నవ్వాలో నవ్వకూడదో తెలియక అలా చూస్తుండి పోయింది.

గదిలోంచి అత్తమామల సంవాదం వినిపిస్తోంది.

"ఉహూఁ ...వద్దు..."

"కొద్దిగా రుచి చూడు... ఫర్వాలేదులే... డాక్టరుగారు పర్మిషనిచ్చారు..."

"అయితే యిలా ఉంచి వెళ్లండి.."

"ఆ బ్రెడ్ ముక్కలు యిలా ఇవ్వు... జామ్‌లాగా రాసిస్తాను.. (ఆశ్చర్యం) ఓసినీ... ఏమిటే ఇదంతా? అయితే, యీ గోంగూర నైవేద్యం ప్లాను నీదేనన్నమాట. నాకు అప్పుడే అనుమానం వేసింది.."

అత్తగారి నవ్వు... మామగారు కూడా...

ఇప్పుడు శ్యామల భర్తని ముద్దెట్టుకుంది.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)